ఓఉదయం రాజు యీ అడివిలో స్వారి వెడుతూండగా ఒకడు దూరంనించి 'కార్తీక పౌర్ణమి' అని అరిచాడు. అందరూకూడా విన్నారు. రాజు అవమానంచేసి వెళ్ళకొట్టిన నౌకరని అనుమానం. రాజుకి చాలాఆగ్రహం. కోపంలో ఉచితానుచితాలుఎరగనంతఉద్రేకం. 'కార్తీకపౌర్ణమి' అనేమాట అతని మనసులో మెసలుతోనే వుంది.

"నిన్న కార్తీకపౌర్ణమి." అన్నాను నేను.

"అవును. ఆసంవత్సరం కార్తీకపౌర్ణమి నాడు అతనికి జ్ఞాపకముంది ఆమాట. ఆరాత్రి తాను పెందరాళే నిద్రపోవడమూ, రాణిగారి గదిలోకి వెళ్ళకపోవడమూ తెలుసుకున్నాడు. ఆలోచించగా, ఏ కార్తీకపౌర్ణమినాడూ తానాచంద్రుణ్ణిచూసిన జ్ఞాపకమేలేదు. ప్రతి కార్తీకపౌర్ణమికీ తానెందుకట్లా నిద్రపోవాలి? ఒక సంవత్సరం ఆగాల్సివొచ్చింది ఆమహారాజు. సంవత్సరమంటే మనకి మల్లే అనుకోకండి. ఒక కసిగాని అనుమానంగాని వాళ్ళమనసుల్లో ఎవరికీ తెలీకండా నిద్రపోతుంది, సులభంగా. ఆకార్తీక పౌర్ణమి నాడు, తనభోజనమూ పానీయమూ జాగ్రత్తగా గమినించాడు. కాని నిద్రపోయినాడు రాత్రంతాలేవకండా. ఎందుకుకలిగిందో రాణిమీద అనుమానంమరి. కాని మళ్ళీ సంవత్సరం ఆగాడు. మనకి మల్లేకాదు. అనుమానం కలిగిందని తెలియచెయ్యడం, తన అనుమానం అబద్ధం కావడమూ జరిగాయా, బదకలేరు ఆమనుషులు. అట్లాంటి అనుమానం రాణికి తెలియచేశాడా భర్త, అక్కడితో ఆరాణి తలుపులుబందు రాజుగారి ప్రవేశానికి. వాళ్ళూ రసపుత్రులు.

ఆకార్తీకపౌర్ణమి సాయంత్రం జబ్బుగా వున్నదనీ ఆకలిలేదనీ తనగదిలో వుండిపోయినాడు ఆయన. కొంచెం షరబత్తన్నా తాగమని కబురంపింది రాణి. వొద్దన్నాడు. తాను స్వయంగా తీసుకొస్తానని రాణినించి కబురు. అనుమానం స్తిరమయింది. రాణి తీసుకువొచ్చి బల్లమీదపెట్టి ఆయనదగ్గిర కొంచెం కూచుని వెళ్ళిపోయినారు. రాజుగారు ఆషరబత్ పారపోశారు. రాణిగారి దాసి ఆగాజుపాత్రని తీసికెళ్ళి రాణిగారికి చూపింది. రాజు నిద్రపోలేదు. కదలకండా పడుకున్నాడు మామూలు ప్రకారం. రాత్రి ఎప్పటివలె గుర్రంమీద ప్రియుడు. తరవాత ఏంజరిగిందో తెలీదు. రాత్రి రెండుగంటలకి రాణిగదిలో పెద్ద శబ్దాలై పరిగెత్తారు కోటలోనిమనుషులు. రాణితల, కిందపడి దొర్లుతోంది. రాజూ ఆ కొత్త యువకుడూ ఇద్దరూ చచ్చిపడి వున్నారు."

"నిన్న కార్తీక పౌర్ణమీ" అన్నాను.

"కార్తీక పౌర్ణమిరాత్రి ఎవరో పొరబాటునైనా ఇటురారు. నేను వుండను."

"ఎందుకు ?"

"దెయ్యాలు మేలుకుంటాయి."

పిల్లలు ఇంటిముందు అల్లరిగా ఆటాడుతున్నారు. నలుగు రమ్మాయిలూ, ఇద్ద రబ్బాయిలూనూ. అబ్బాయి లిద్దరూ ఒకరి నొకరు "ఔట్" చేసుకోవలిసిందేకాని, ఆడపిల్లలు వాళ్ళని "ఔట్" చెయ్యలేరు.

శేషు వరండాలో స్తంభాని కానుకుని నిలబడి వాళ్ళ ఆటను గమనిస్తున్నది. ఆమె మొహం చూస్తే ఏదో పరధ్యానంలో ఉన్నట్టు కనిపించినా ఆమె ఆలోచనలు పిల్లల ఆటకు ఆటే దూరంపోలేదు.

ఆడేపిల్లల్లో కల్లా సీను పెద్దవాడు. పన్నెండేళ్ళుంటై. చక్కని మొహం. పెద్ద కళ్ళు. పట్టుకుచ్చులాటి జుట్టు. ఏమాత్రమూ అలవకుండా అందర్నీ పరిగెత్తిస్తున్నాడు. ఆటకు నాయకుడు. ఆడపిల్లల్లోకల్లా రవణి పెద్దది. పదేళ్ళు. మిగిలినవాళ్ళకన్న చాలా అందగత్తె. రవణి అంటే సీను కిష్టమేమో. లేకపోతే దాన్ని ఒక్కసారైనా ఔటు చెయ్యడా?.. అవును, అందుకే సీను సుబ్బుల్నికూడా ఔటు చేశాడు. ఎందుకంటే సుబ్బులు రవణిని ఔట్ చేశాడు. సుబ్బులు రవణిని ఔటుచేశాడనే పంతంకొద్దీ సీను సుబ్బుల్ని రెండుసార్లు వరసగా ఔటు చేశాడు....మగపిల్లలు దొంగలయి వెంటపడ్డప్పుడల్లా ఆడపిల్లలు కయ్యోమని అరుస్తారు. చెవులు చిల్లులుపడేట్టు. పాడుముండ, రవణి అందరికన్నా చెవులు గింగుర్లెత్తిస్తుంది....

ఆటలో ఔటయితేనేం? ఆటలో షరతులన్నీ మనం పెట్టుకునేవేగా? ముట్టుకుంటే దొంగ కావటమూ, ముట్టుకునే లోపుగా కూర్చుంటే దొంగ కాకపోవటమూ, అందరికన్నా ఆఖరుకు కూర్చున్నవాళ్ళు దొంగ కావటమూ, కూర్చున్నవాళ్ళు పరిగెత్తేవాళ్ళు ముట్టుకుంటే గాని లేవలేకపోవటమూ – ఇవన్నీ నిజమా? వొట్టి ఆట. అంతా అనుకోవటాలే.

మొగుడు చచ్చిపోతే వెధవకావటమంటే అది నిజం. కిందటిజన్మలో ఏదో పాపం చేసుకుంటే ఈ జన్మలో మొగుడుపోతాడు. పుణ్యం చేసుకున్నవాళ్ళు మొగుడికన్న ముందుపోతారు చక్కగా! అందుచేత కిందటి జన్మకూడా నిజమే.. అబ్బ! దీనినోరు పడిపోనూ! భగవంతుడు రవణి కెంత గొంతు పెట్టాడూ! సుబ్బులు తనని పట్టుకు నలిపేసినట్టు ఎట్లా అరుస్తుందో! అదంతా భయమా? నటన! సంతోషమే!...సీను వొట్టి వాజ. కాకపోతే తానే దొంగ అయి రవణివెంట పరిగెత్తడూ? సుబ్బులుకు దొంగ కావటం అభ్యంతరంలేదు. ఏడిచినట్టుంది వీళ్ళ ఆట! అబద్ధం ఆటా వీళ్ళూనూ:...

మొగుడు పోయినవాళ్ళు తల కెందుకు గొరిగించుకోవాలో? చిన్నప్పుడు కాకపోయినా పెద్దయినాక తప్పదు. లేకపోతే ఆ లక్ష్మమ్మను గురించినట్టే చెప్పుకుంటారు. లక్ష్మమ్మ ఒక మంచిచీరె కట్టదు, కళ్ళకు కాటిక పెట్టదు, ఏమీ చెయ్యదు, పాపం. జుట్టు తీయించలేదు. అందుకని లక్షమ్మను గురించి అసహ్యంగా మాట్లాడతారు. అటువంటి మాట



"మాఅబ్బాయి మీ కిటికీఅద్దాలు పగల గొట్టాడా?....భలేపనిచేశాడు. ఎక్కువగా బెదిరిస్తే నేనొచ్చి ఆ మిగిలినవికూడా పగల గొడతాను."

లనిపించుకోవటం కంటె జుట్టు తీయించుకోవటమే హాయబ్బా!

జుట్టుతీయించుకోవటమూ రోతే. మంగలాడిముందు కూచోవాలి. అత్తయ్య చూడ రాదూ! ఛీ! ఛీ!

వెధవముండలు తిరిగి పెళ్ళిళ్ళెట్లా చేసుకుంటారో? వాళ్ళకి తప్పు చేస్తున్నట్టుండదు గామాలు? అందరితోనూ మామూలుగా మాట్లాడటానికి వాళ్ళకి బిడియంగా ఉండదేమో? ఆ సరస్వతి చూడరాదూ?....సరస్వతిని అందరూ ఎదట సరిగానే చూస్తారు. కాని సరస్వతి చాలా చెడ్డపని చేసిందని అందరికీ తెలుసు. ఆవిడ మొగుడు తనే ఆవిడ మొగుడన్నట్టు ఎట్లా తిరుగుతాడో? ఆవిడకి ఒకప్పు డింకో మొగుడున్నాడని తెలీదూ? ఛీ, ఛీ! కాపరమే చెయ్యాలా ఏం? పుస్తె కట్టినాక మొగుడు మొగుడే!

మొగుడు పోయినదాన్ని పెద్ద వాళ్ళు నీచంగా చూస్తారంటే అట్లా చూడటంచేత కిందటిజన్మలో చేసుకున్న పాపమంతా పోతుంది....

*   *   *

శేషకు పదమూడో ఏడు. ఆమె మనస్సులో ఉన్న ఈ నమ్మకాలు ఒకరు మప్పినవికావు. పదమూడేళ్ళపిల్ల హృదయంలో కూడా, ఈ లోకంలో ఏదో ఒక విధమైన న్యాయం ఉంటుందనే విశ్వాసం ఉంటుంది; ఆవిశ్వాసమే లేకపోతే అంతచిన్న హృదయం కూడా గాలికి బుడగ విచ్చినట్టు విచ్చిపోక తప్పదు. లోకంలో ఉండదగిన న్యాయం ప్రత్యక్షంగా కనిపించకపోతే అంతలేత హృదయమూ, సాలీడు తనకుతానే గూడు అల్లుకున్నట్టుగా, లోకంలో ఉండదగిన ఆన్యాయాన్ని సృష్టించు కుంటుంది. ఒకటే వ్యత్యాసం: సాలీడు తనగూడులో ఎన్నడూ చిక్కుకోదు, మానవ హృదయమో తన గూడు విడిచి ఒకంతట పైకి రాలేదు.

అకస్మాత్తుగా పిల్లలు ఆట చాలించారు. అరుపులు ఆగినై. శేష వీధి గుమ్మంకేసి చూసింది. నరసమ్మగారు ఫెళఫెళలాడే పట్టు చీరె, రంగురంగులది కట్టుకుని మొహాన రూపాయంత కుంకంబొట్టు పెట్టుకుని, గాలిలో ఈదుతున్న దానల్లే లోపలికి వస్తున్నది. ఆవిణ్ణి చూడగానే శేషకు ఎందుకో నవ్వ బుద్ధయింది. కాని ఆనవ్వు పైకి రావటానికి ఏమాత్రమూ ప్రయత్నించలేదు.

"మీ అమ్మేదే, శేషా?" అన్నది నరసమ్మ.

"పురాణం వినటానికి వెళ్ళింది."

"మీ అక్కయ్యో?"

"దొడ్లో తలంటి పోసుకుంటున్నది."

"మాపిల్ల సావిత్రీ గౌరీదేవి వ్రతం చేసుకుంటున్నదీ. నేను వచ్చిపోయినానని మీ అమ్మతో చెప్పు!" అంటూ నరసమ్మ దొడ్డికేసి వెళ్ళింది. "జానకీ?" అని ఆవిడ కేకలు పెట్టటం శేషకు వినిపించింది.

పిల్లలు ఆట చాలించారు. పొద్దూకుతున్నది కూడానూ. శేష వరండాదిగి ఆవరణలోకి వచ్చింది. నరసమ్మగారు తిరిగివచ్చి వరండాలో గడపకి కుంకంబొట్టు పెడుతూ, "నేనొచ్చానని మీ అమ్మతో చెప్పు!" అంటూ వెళ్ళిపోయింది.

శేష నరసమ్మకు సమాధానం చెప్పలేదు. నరసమ్మను చూస్తేనూ, నరసమ్మ కూతుర్ని చూస్తేనూ, సావిత్రీగౌరీదేవి వ్రతాలుచూస్తేనూ ఒక్కసారిగా శేషకు మండిపోయింది. ఏ ధ్యానం మీదనోఉండి శేష తలవాకిలి దగ్గిరికి వెళ్ళి దడాలున తలుపుమూసి గడియపెట్టింది. కాని మరుక్షణమే గడియతీసి తలుపులుకూడా బార్లా తెరిచింది. "అసలు సంధెవేళ ఈ తలుపులు మూసుకోవట మేమిటే?" అని తల్లి వచ్చి కోప్పడుతుంది.

తలుపు తెరుస్తూనే వాకిట్లో ఎవరో ఉండటంచూసి శేష ఉలిక్కి పడింది. అయితే మరుక్షణం మనిషిని గుర్తించి, "బావా, ఇదేనా రావటం?" అన్నది.

బావ, "ఏంశేషా, కులాసాగా ఉన్నావా? కిందటిసారి చూసినప్పటికన్న కాస్త లావయినట్టున్నావే?....జానకి ఏదీ?" అంటూ లోపలికి వచ్చాడు.

"అక్కయ్య తలంటి పోసుకుంటున్నది. అమ్మ పురాణం వినబోయింది. నేను నిజంగా పొడుగెదిగానా?" అన్నది శేష.

బావ నవ్వుతూ, "పొడుగెదగలేదు గాని కాస్త లావయినట్టు అవుపిస్తున్నావు." అన్నాడు.

"నేనేం లావుకాలేదు," అన్నది శేష, లావు కావటం చాలా తప్పయినట్టు.

"రోజూ నీవొళ్ళు నువు చూసుకుంటుంటే తెలీదు. నామాదిరిగా ఎప్పుడైనా ఒకసారి చూసే వాళ్ళకి తెలుస్తుంది," అన్నాడు బావ.

శేష మాట్లాడలేదు. బావ అనకూడని మాట ఏదో అన్నట్టుగా తోచింది శేషకు.

బావా శేషా కలిసి ఇంట్లో ప్రవేశించారు. ఇంట్లో అప్పుడే చీకటిగా ఉంది.



"నాలుగు వెంట్రుకలుకూడా లేవే, దేనికీ పదణాలు చార్జీ?"

"ఆ వెంట్రుకలు వెతికినందుకండీ అర్ధ రూపాయి. బేడ గడ్డానికి."

ఇంకా దీపంపెట్టలేదా అని బావ అడుగుదామనుకుంటుండగా శేష అతని పక్కనుంచి గబగబా, వెనకనుంచి ఎవరో తరిమినట్టు పారిపోయింది లోపలికి. బావ సావిట్లోనే ఆగిపోయినాడు.

ఒక నిమిషంపాటు దీపంజాడగాని శేష అలికిడిగాని లేకపోవటంచూసి అతను "శేషా;" అని పిలిచాడు. శేష వంట ఇంటి వేపునుంచి, "నిప్పెట్టె కనపడిచావదేం?" అనటం అస్పష్టంగా వినిపించింది.

"నిప్పెట్టెకోసం వెతుకుతున్నావా? నా దగ్గిర ఉంది పట్టుకెళ్ళు," అన్నాడు బావ.

కాస్సేపటికి వంటింటి వేపుగడప దగ్గిర శేష ఆకారం అస్పష్టంగా కనపడింది. "ఇట్లా పడెయ్యి," అన్నది శేష. తన కర్థంగాని ఆజ్ఞలను పాటిస్తున్న యుద్ధ సైనికుడల్లే బావచేతిలో ఉన్ననిప్పుపెట్టె ఆమె వేపు విసిరివేశాడు. గలగలా చప్పుడుచేస్తూ నిప్పుపెట్టె మండిగానికి కొట్టుకుని కింద

పడింది. నిప్పుపెట్టె తీసుకుని శేషు ఆకారం అదృశ్యమయింది.

బావ దొడ్డివాకిలికేసి నడవసాగాడు. అటునుంచి లోపలికివస్తూ జానకి, "ఇంకా దీపం పెట్టలేదుటే ?....ఎవరూ ?" అన్నది భర్తను గుర్తించక.

"ఎవరా ?" అన్నాడు బావ.

"మీరా ? ఎప్పుడొచ్చారూ ? చీకటిపడ్డా శేషు దీపం పెట్టలేదేమో ?"

"పెడుతున్నది. తలంటి పోసుకుంటున్నావా ? నేనొస్తాననే ?" అన్నాడు బావ అకస్మాత్తుగా మరోమనిషి అయిపోయి. అతనిలాటి భార్యాప్రియుడు రెండునెల్లయిన తరవాత భార్యను చూడగానే కొన్ని వెకిలి మాటలు మాట్లాడతాడని మనం సులభంగా ఊహించుకోవచ్చు...

*   *   *

నాన్న, బావతోపాటు జానకికూడా భోం చేసింది. "నువుకూడా కూచోవే," అని తల్లి అంటే శేషు కూచోలేదు. శేషుకు జానకిని చూస్తే నవ్వొచ్చింది. కాని ఆనవ్వు పైకి రావటానికి ప్రయత్నించలేదు. జానకి ముస్తాబయింది. తెల్లటిచీరెకట్టింది. కళ్ళకి నాజూకుగా కాటిక పెట్టింది. రోజూమోస్తరుగా లప్పెడు పట్టించలేదు. మల్లుజాకెట్టు తొడుక్కుంది. ఈమార్పంతా ఒక లెఖ్ఖలోదికాదు. జానకిమొహమే మార్చేసింది. మొహంమీద రోజూకనపడే కొంతచిరాకూ, చీదరా దాచి పెట్టెలో పెట్టేసింది. మొహంతోపాటు గొంతుకూడా మార్చేసింది జానకి. జానకి ఇంకోమనిషల్లే కనిపించటానికి ప్రయత్నిస్తున్నదొంగల్లే కనిపించింది శేషుబుద్ధికి. జానకినిచూస్తే శేషుకి చంప బుద్ధయింది.

బావా జానకీ భోజనాలయినాక జానకి తన కంచమూ తన మొగుడివిస్తరీ ఎత్తబోయినట్టు నటించింది.

"ఎందుకమ్మా నేను ఎత్తుతాలే. నువు వెళ్ళు," అన్నది తల్లి. ఆవిడ అట్లా అంటుందని తెలిసినట్టుగానే జానకి చివాలునలేచి వెళ్ళి చెయ్యికడుక్కుని గదిలోకి వెళ్ళిపోయింది.

"రేపటినుంచీ జానకి మామూలు మనిషల్లేనేఉంటుంది. మాతోపాటుఅన్నంతింటుంది. మామూలు మొహంపెడుతుంది. మామూలు గొంతుతో..మాట్లాడుతుంది..దొంగ! దొంగ! అప్పుడే గదిలోదూరింది ! ఇంకా అంతా అన్నాలు తినకుండానే - ఎవరూ పడుకోకుండానే ! ఛీ, ఛీ !" అనుకున్నది శేషు....

"నాన్నా, నువు వసారాలో పడుకుంటావా, సావిట్లోనా ?" అని అడిగింది శేషు.

"వసారాలోనే పడుకుంటానమ్మా,"అన్నాడు నాన్న.

"నేనుకూడా వసారాలో వేసుకోనా ?" అన్నది శేషు.

"వేసుకో !" అన్నాడు నాన్న, ఎన్నడూ తన పక్కవిషయం సలహా అడగని శేషు ఇవాళ అడగటం ఆయన కర్థంకాలేదు.

నడుమువాల్చటం వ్యవధానంగా శేషుకు నిద్రపట్టిపోయింది. పదిగంటలబండికి అన్నా వదినా వచ్చేసరికి శేషు గాఢనిద్రలో ఉంది. నాన్నా అన్నయ్యా మాట్లాడుకోవటమూ, తల్లి లేచి మళ్ళీ వంటచెయ్యడమూ, వదినె తన పక్కలోనే పడుకుని తెల్లవార్లూ నిద్రపోవటమూ శేషు ఎరగనే ఎరగదు.

తెల్లవారుఝామున అందరికన్నా ముందు నిద్రలేచిన శేషు తనపక్కలో మరోమనిషి ఉండటంచూసి గాభరాపడి, ఆశ్చర్యపడి, అర్థంచేసుకున్నాక కలిగిన ఆనందానికి మేర లేదు. శేషుకు తన వదినెనుచూస్తే కలిగిన ఆనందంలాటిది కలిగి ఎన్నో నెలలు అయినట్టుంది.

"వొదినా, వొదినా !" అంటూ శేషు వొదినెనుఊపి నిద్రలేపింది. కళ్ళమీద కూర్చున్న నిద్రబరువుకు రెప్పలు బలవంతాన ఎత్తి వొదినె శేషునుచూసి మళ్ళీ కళ్ళు మూసేసి చిరునవ్వునవ్వుతూ, "రాత్రిపడుకునేటప్పటికి చాలా పొద్దుపోయింది, శేషూ. మేంరావటం నీకు తెలీదుగా ?" అన్నది.

తనవొదినె అంత అందమైనమనిషి ప్రపంచంలో లేదనిపించింది శేషుకి. వొదినె దగ్గిర దొంగవేషాలులేవు. వొదినె ఎప్పుడూ తనవిషయమే ఆలోచించదు. ఆతేడా ఎక్కడుందంటే చెప్పటం పదమూడేళ్ళపిల్లకి సాధ్యంకాదుగాని తేడాఉందని చంటిపిల్లక్కూడా ఎట్లాగో తెలుస్తుంది.

*   *   *

అమ్మ వొదినెను తలంటుకోమంది. శేషుకూడా అడిగింది.

"నువ్వంటుకుంటే నేనూ అంటుకుంటా," అన్నది వొదినె శేషుతో.

"బాగాఉంది. నాకిప్పుడు తలంటే తక్కువయిందా యేం ?" అన్నది శేషు. కాని వొదినెతోపాటు తానుకూడా తలంటి పోసుకుంది. తలంట్లుకాగానే వొదినె వాళ్ళచుట్టాలింటికి బయలుదేరుతూ, "నువుకూడారా, శేషూ. లేకపోతే మాచిన్నమామ్మ నన్ను భోంచెయ్యమని చంపుతుంది," అన్నది.

ఇద్దరూకలిసి వదినె చిన్నమామ్మగారింటికి వెళ్ళారు.

చిన్నమామ్మగారి రెండో అల్లుడుకాబోలు శేషునిచూసి, "పాపం, ఈపిల్లకే గదూ ఈ మధ్యా—?" అన్నాడు.

"అవును. ఈమధ్యేం ? అప్పుడే రెండేళ్లు పూర్తి కావస్తున్నది," అన్నది వదినె.

"ఇంకా మళ్ళీ పెళ్ళి చెయ్యలేదేం ? చెయ్యక పోయినారా ? ఎన్నేళ్ళు ? "అన్నాడాయన. చూడటానికి తారుసిద్దెల్లే ఉన్నాడు గాని ఆయన్నుచూస్తే శేషు కెందుచేతో అసహ్యం వెయ్యలేదు.

"ఎక్కడిదీ ? ఇంకా పదమూడైనా వెళ్ళలేదు. వచ్చే యేటినుంచీ అమ్మాయిగారికి సంబంధాలు చూడాలి," అన్నది వదినె శేషు మెడ గట్టిగా చేత్తో అదుముతూ.

అకస్మాత్తుగా శేషుకు వొళ్ళంతా డొల్ల అయిపోయి శరీరం గాలిలో తేలిపోబోతున్నట్టయింది. సమీపంలో ఎక్కడో లొటు ఆడుతున్న పిల్లల్లో ఎవరో "ఔట్ !" అని కేకవేశారు. శేషు విరగబడి నవ్వసాగింది.

వదినె శేషుకేసి ఆశ్చర్యంగా చూసింది. ఆవిడకు శేషు నవ్వు అసహజంగానూ బాధాకరంగానూ కనిపించింది.

"ఏమిటమ్మా, శేషూ?" అన్నది వదినె.

శేషు నవ్వు సంబాళించుకుని కళ్ళుతుడుచుకో సాగింది. శేషు మొహం ఇప్పుడు ఏడుపు చాలించినట్టున్నది గాని నవ్వు చాలించినట్టులేదు.

"ఎవరో పిల్లలు లొటాడు తున్నారు." అన్నది శేషు. ఆమాటకూడా సరిగా ఎవరికీ అర్థం కాలేదు. ఎందుకంటే ఆమాట పూర్తి చేసే లోపుగా శేషుకు పెద్ద ఎక్కువచ్చి, ఆమె శరీరం తుపానుకు కదిలే రేకులపాకాలాగా చలించిపోయింది.